## నేడు జిల్లా సర్వసభ్య సమావేశం

నిర్మల్ టౌన్, మార్చి 18: పట్టణంలోని మయూరి ఇన్‌లో మంగళవారం విద్యుత్ ఉద్యోగుల సంఘం(1104) జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పోచయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సాయిబాబు హాజరు కానున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు. నిర్మల్, భైంసా సర్కిల్ పరిధి 1104 సంఘం ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## నేడు ఆలయ వార్షికోత్సవం

ఖానాపూర్, మార్చి 18: పట్టణంలోని శాంతినగర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ 9వ వార్షికోత్సవం నేడు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఇందుకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనిమ్మగడ్డ నాగరాజు శర్మ, వాసుదేవ చార్యులు, శ్రీమాన్ చక్రపాణి నరసింహమూర్తి ఆధ్వర్యంలో పలు పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం శుద్ధి పుణ్యాహవా చనం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకం, శాంతి హోమం, బలిహరణం, మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కతులపురం వంశం ఆధ్వర్యంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని పేర్కొన్నారు.

## చిరుజల్లులు

భైంసాటౌన్, మార్చి 18: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండకాసింది. తర్వాత వాతావరణం చల్లబడి తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. జొన్న, మక్క పంట చేతికి రావడంతో, ఎక్కడ నష్టపోతామోనని రైతులు మాత్రం దిగులు చెందారు.

## పనులు పూర్తి చేయాలి

ముథోల్, మార్చి18: మండల కేంద్రంలోని నయాబాదీ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ దవాఖానను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు ముథోల్ మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవాఖాన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయిందని పేర్కొన్నారు. ముథోల్, తానూర్ మండలాల వాసులు ఈ దవాఖానలో వైద్య సేవల కోసం వస్తుంటారని తెలిపారు. వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే, పేద ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. సాయినాథ్, తదితరులున్నారు.

## పరామర్శ

కుంటాల, మార్చి 18: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన నాయకులు గుద్దేటి గంగాధర్, గుద్దేటి నర్సయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ సోమవారం పరామర్శించారు. జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీ భోజారామ్ పటేల్, ఓం ప్రకాశ్ లడ్డా, పసుల నవీన్, చిన్నా రెడ్డి, తదితరులున్నారు.

## నిలిచిన జీరో బిల్లు నమోదు

భైంసాటౌన్, మార్చి 18: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జీరో బిల్లు నమోదు కేంద్రంలో వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో జీరో బిల్లు నమోదు కోసం వివిధ గ్రామాల నుంచి కార్యాలయానికి వచ్చిన విద్యుత్ వినియోగదారులు నిరాశతో వెనుదిరిగారు. ప్రజా పాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలను సరిగ్గా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉంటే, ఇలా ఇబ్బందులు ఉండేవి కాదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎలక్షన్ కోడ్ వల్ల నమోదు చేయడం ఆగిపోతే మూడు నెలలు విద్యుత్ బిల్లు చెల్లించాల్సిందేనని అంతా చర్చించుకున్నారు.

# బిల్లులు రాక.. బడిరూపు మారక..

- పలుచోట్ల అసంపూర్తిగా పనులు
- కౌట్ల(బీ)లో ప్రారంభం కాని పనులు
- ప్రభుత్వం మారడంతో ముందుకు సాగని నిర్మాణాలు



సారంగాపూర్: నిలిచిన జామ్ ప్రాథమిక పాఠశాల పనులు



జామ్ ఉన్నత పాఠశాలలో నిలిచిన డైనింగ్‌హాల్ పనులు

సారంగాపూర్, మార్చి 18: సర్కారు పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన 'మన ఊరు– మనబడి' కార్యక్రమ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచి పోయి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. కొన్నిచోట్ల ముందుకు వచ్చినా చేసిన పనులకు నిధులు రాక చేతులెత్తేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ అంశంపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం... సారంగాపూర్ మండలంలో తొలివిడుతలో 22 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో పనులు చేట్టేందుకు రూ. 5.20 కోట్లు అంచనా వేశారు.

### రూ. 1.87 కోట్లు మంజూరు..

పనుల పురోగతి ఆధారంగా నిధులు విడుదల చేయాలని నిర్ధేశించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో మూత్రశాలలు, విద్యుత్తు సరఫరా, తాగునీటి వసతి, ఫర్నిచర్, రంగులు, మరమ్మతులు, వంటగది, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్, డిజిటల్ తరగతుల నిర్వహణకు వీటిని కేటాయించారు. 21 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టగా, ఇప్పటి వరకు రూ. 1.87కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇంకా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు.

### మండలంలో పరిస్థితి ఇలా..

జామ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ. 24.36లక్షలు మంజూరు కాగా, వీటితో డైనింగ్‌హాల్, విద్యుదీకరణ, తాగునీరు, పాఠశాల మరమ్మతులు చేయాల్సి ఉంది. అయితే గుత్తేదారు చేసిన పనులకు రూ. 7.47లక్షల వరకు చెల్లించా రు. మిగతా పనులు ఆగిపోయాయి.

బీరవెల్లి ఉన్నత పాఠశాలలో అదనపు గదులు, డైనింగ్‌హాల్, వివిధ పనుల నిర్మాణం కోసం రూ. 63.85లక్షలు మంజూరయ్యాయి. చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు నయా పైసా కూడా రాకపోవడంతో పనులు నిలిపి వేశాడు. కాంట్రాక్టర్‌కు నెలల తరబడి బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

కౌట్ల(బి) ఉన్నత పాఠశాలకు రెండు అదనపు గదులు, డైనింగ్‌హాల్, కరెంట్ తదితర పనుల నిర్మాణం కోసం రూ. 54.02 లక్షలు మంజూరు కాగా ఇప్పటి వరకు పనులు ప్రారంభానకి నోచుకోలేదు.

ఆలూర్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులు, డైనింగ్‌హాల్‌తో పాటు వివిధ నిర్మాణ పనుల కోసం రూ. 57.73లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే మేజర్ పనులు పూర్తి కాగా, మైనర్ రిపేర్ పనులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు రూ. 15లక్షలు మాత్రమే చెల్లించారు. దీంతో గుత్తేదారు పనులు నిలిపి వేశారు.

జామ్ ప్రాథమిక పాఠశాలలో ఆయా పనులకు రూ. 69.79 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో భవన నిర్మాణ పనులు మాత్రమే నిర్మించి, మిగతా పనులను కాంట్రాక్టర్ నిలిపి వేశాడు. చేసిన పనులకు రూ. 36 లక్షల బిల్లు ప్రభుత్వం చెల్లించింది.

## అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



పిల్లల ఎత్తును నమోదు చేసుకుంటున్న సీడీపీవో సరిత

ఖానాపూర్ రూరల్, మార్చి 18: మండలంలోని సత్తనపల్లి , పాత ఎల్లాపూర్, అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో సరిత, సూపర్‌వైజర్ శ్రీలత సందర్శించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆయా కేంద్రాల్లో భోజనం చేసి వెళ్లాలని సూచించారు. మార్చి నెలలో కుటుంబ సర్వే చేయాలని టీచర్లను ఆదేశించారు. పోషణ పక్షంలో నిత్యం షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

## గుండంపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపణ



పూజలు చేస్తున్న పండితులు

దిలావర్‌పూర్, మార్చి 18: మండలంలోని గుండంపల్లి గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపణ మహోత్సవం సోమ వారం పండితులు సంజయ్ శర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉదయం గ్రామంలో విగ్రహాల ఊరేగింపు, ఆలయం వద్ద పండితుల ఆధ్వర్యంలో మహా గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# గోదామును వినియోగంలోకి తేవాలి

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



కుంటాల: గోదామును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

కుంటాల, మార్చి 18: మండలంలో నిర్మించిన గోదామును వెంటనే వినియోగంలోకి తేవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. కేసీఆర్ ప్రభుత్వ హయంలో రైతుల సౌలభ్యం కోసం రూ. 40 లక్షలతో వ్యవసాయ గోదాం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇటీవల నిర్మాణ పనులు పూర్తికాగా, సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ పరిశీలించారు. రైతులకు త్వరగా వినియోగంలోకి తేవాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డీఆర్డీఏ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి రమ్య, ఉన్నారు.

### అందకూర్ నర్సరీ తనిఖీ

అందకూర్ గ్రామంలోని నర్సరీని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సోమవారం తనిఖీ చేశారు. నర్సరీలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రీన్ నెట్ ఏర్పాటు చేసి మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై అభినందించారు. అనంతరం గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లు, స్వచ్ఛభారత్ మిషన్ మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి రమ్య, టెక్నికల్ అసిస్టెంట్ శశిధర్, ఎఫ్ఏ భోజన్న ఉన్నారు.

### విద్యావేత్తలుగా ఎదగాలి

దిలావర్‌పూర్, మార్చి 18: భావి తరాల కోసం విద్యావేత్తలుగా ఎదగాలని నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ విద్యార్థులకు సూచించారు. కాల్వ తండా ప్రభుత్వ పాఠశాల, అంగన్ వాడీ సెంటర్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. వారితో పాఠాలు చదివించారు. వసతులపై అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచే ఇష్టపడి చదివి, భవిష్యత్‌లో ఉన్నతోద్యోగాలు సాధించాలని సూచించారు. ఎంపీవో అజీజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి ప్రీతి ఉన్నారు.

### చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

నర్సరీల్లో మొక్కల రక్షణ కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. అనంతరం కేంద్రంలోని గదుల్లోకి వెళ్లి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మండల పరిషత్ కార్యలయం ఆవరణలో ఉన్న ఉపాధి హామీ నర్సరీని పరిశీలించి, అక్కడి అధికారులకు సూచనలు చేశారు. ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో దివ్యారెడ్డి, ఈవో చంద్రశేఖర్, ఈజీఎస్ సిబ్బంది వెంకట్,కుంట. శ్రీనివాస్, కారోబార్ రాజు, తదితరులున్నారు.

# బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలి



దస్తురాబాద్ : వివరాలు అడుగుతున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్

దస్తురాబాద్,మార్చి 18: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సర్ఫారాజ్ నవాజ్ సూచించారు. మండలంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం అధికారులు, బీఎల్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్వోల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించాలని సూచించారు. అర్హులైన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని ఆదేశించారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని, చేర్పులు మార్పులు ఉంటే చేయాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవరావు, ఆర్ఐ గంగన్న, జూనియర్ అసిస్టెంట్ మధు, బీఎల్వోలు, తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఖానాపూర్ రూరల్, మార్చి 18: ఖానాపూర్ పట్టణంతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎంపీవో చంద్రశేఖర్, సెక్టార్ ఆఫీసర్ పరిశీలించారు. ఎన్నికల నాటికి అన్ని కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

# ఖానాపూర్ పట్టణాభివృద్ధే ధ్యేయం

- మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

ఖానాపూర్, మార్చి 18: ఖానాపూర్ పట్టణాభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 6, 11 వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి పర్యటించారు. వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఇటీవల ఈదురు గాలులు, వడగండ్ల బీభత్సానికి దెబ్బతిన్న డ్రైనేజీలను పరిశీలించారు. రానున్న రోజుల్లో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా తొలగించేందుకు కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఆయా వార్డుల కౌన్సిలర్లకు, పురపాలక సంఘ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

## డిపో మేనేజర్‌ను కలిసిన పొన్కల్ వాసులు



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న వీడీసీ సభ్యులు

నిర్మల్ అర్బన్ (మామడ) మార్చి 18: మామడ మండలంలోని పొన్కల్ గ్రామానికి అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరతూ సోమవారం వీడీసీ సభ్యులు, గ్రామస్తులు డీఎం ప్రతిమా రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి ఆర్టీసీ సర్వీసుల సంఖ్యను పెంచాలని ఆమెకు విన్నవించారు. ఈ మేరకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావును పొన్కల్ వీడీసీ కమిటీ, గ్రామస్తులు కలిశారు. పొన్కల్ నాగదేవత, హనుమాన్, గంగా మాత ఆలయాలకు త్వరగా అనుమతులు ఇప్పించి నిధుల మంజూరుకు కృషి చేయాలని విన్నవించారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు సానుకూలంగాస్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద, మార్చి 18: మండలంలోని పార్‌పెల్లి తండా గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న స్థావరంపై సోమవారం ఏఎస్ఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి చేశారు. అక్రమంగా నిల్వఉంచిన నాలుగు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. తయారీ కోసం నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నట్లు తెలిపారు. గుడుంబా తయారుచేసినా, అమ్మినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది గణేశ్, మోహన్, భూమన్న పాల్గొన్నారు.

## ఆశ్రమంలో అన్నదానం

నిర్మల్ టౌన్, మార్చి18: పట్టణంలోని మంజులాపూర్ ఆశ్రమంలో సోమవారం లయన్స్‌క్లబ్ సభ్యులు పరమేశ్వర్ కుమారుడు మౌళినాథ్ జయంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఆశ్రమంలో ఉన్న వారికి పాలు, పండ్లు, ఆహారం అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పురుషోత్తమ్ రెడ్డి, చంద్రమోహన్, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

తానూర్, మార్చి, 18 : మండలంలోని దౌలతాబాద్ గ్రామానికి చెందిన రాజులోల్ల ఎల్లప్ప (50)ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు. ఎల్లప్పకు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య భోజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వడగాలులకు దెబ్బతిన్న పంటల పరిశీలన



పీచరలో మక్క పంటను పరిశీలిస్తున్న ఏఈవో పవిత్ర

లక్ష్మణచాంద, మార్చి 18: మండలంలో శనివారం రాత్రి వీచిన వడగాలులకు పీచర, పార్‌పెల్లి, ధర్మారం, మునిపెల్లి, చింతల్‌చాంద, చామన్‌పెల్లి తదితర గ్రామాల్లో పంటలు నేల కొరిగాయి. దీంతో వ్యవసాయ అధికారులు సోమవారం ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మక్క, నువ్వు తదితర పంటలు పెద్ద ఎత్తున నేలకొరిగాయి. మండలంలోని పీచర గ్రామంలో ఏఈవో పవిత్ర, చామన్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో ఏఈవో ఉమామహేశ్వరీ పరిశీలించగా మునిపెల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ పడిపోయిన పంటలను పరిశీలించారు. పంటనష్టంపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు తెలిపారు. చేతికచ్చే దశలో ఉన్న మక్కపంట నేలకొరగడంతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఈ నెల 24న హోలీ పండగ



నాయకులకు అందజేస్తున్న పురోహితుడు

ఖానాపూర్, మార్చి 18: ఈ నెల 24న ఖానాపూర్ పట్టణంలో హోలీ పండగ నిర్వహించనున్నట్లు హిందూ ఉత్సవ సమితి నాయకులు సోమవారం వెల్లడించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ అర్చకుడు నర్సింహమూర్తి పంచాంగ శ్రావణాన్ని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, హిందూ ఉత్సవ సమితి నాయకులు పేర్కొన్నారు. శనివారం కామదహనం, ఆదివారం హోలీ పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు సురేశ్, నాయకులు శ్యామ్, బీసీ రాజన్న, సతీశ్‌రావు దేశ్‌పాండే, బీసీ రమేశ్, గౌరీకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపణోత్సవాలు ప్రారంభం



తర్లపాడులో యజ్ఞం చేస్తున్న భక్తులు

ఖానాపూర్ రూరల్, మార్చి 18: ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో గతేడాది వెలిసిన అగ్గి మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు యజ్ఞం నిర్వహించారు. 20న విగ్రహ ప్రతిష్ఠాపణ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు అలయ కమిటీ బృందం తెలిపారు. మాజీ సర్పంచ్ పెద్ది గోదావరి నర్సయ్య, అంగిరేకుల నగేశ్, బీరయ్య, రత్నం, గాండ్ల శ్రీనివాస్, పెద్ది మల్లేశ్, పెద్ది బీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ



నామినేషన్లను స్వీకరిస్తున్న ఎన్నికల అధికారులు

నిర్మల్ అర్బన్, మార్చి 18: నిర్మల్ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను సోమవారం ఎన్నికల అధికారులు నరేందర్, రమణ స్వీకరించారు. ఈనెల 20వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 22న ఉపసంహరణ, 28వ తేదీన ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. తొలిరోజు 8 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు.

## అమల్లోకి ఎన్నికల నిబంధనలు



ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

దస్తురాబాద్,మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై వివిధ రాజకీయ పార్టీల రాతలు, వాల్ పోస్టర్లు, బ్యానర్లను అధికారులు తొలగిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు మున్యాల గ్రామంలో ఈ మేరకు పంచాయతీ సిబ్బందితో కలిసి అధికారులు తొలగించారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు.

# ఒంటిపూట.. కనిపెట్టాలి కంట

- పిల్లల కదలికపై జాగ్రత్త
- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే..



దస్తురాబాద్,మార్చి 18: వేసవి నేపథ్యంలో పిల్లలకు ఒంటి పూట బడులు ప్రారంభమయ్యాయి. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక ఇంటికొచ్చాక పిల్లలంతా ఆటపాటల్లో సరదాగా గడిపేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కాలువలు, వ్యవసాయ బావులల్లో ఈత కొడుతూ ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందుతుంటారు. ఆటలు, ఈత శారీరక వ్యాయామంగా మంచిదే అయినప్పటికీ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది. పిల్లల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

### బాధ్యతగా కనిపెట్టాల్సిందే..

పిల్లలను తల్లిదండ్రులు బాధ్యతగా కనిపెడుతుండాలి. ఆటలు, ఈత వంటివి స్వయంగా, నిపుణుల పర్యవేక్షణలో జరిగితే ఎలాంటి ప్రమాదాలకు తావుండదు. చెప్పకుండా బయట తిరిగే పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరిస్తూ వారిని దారిలోకి తెచ్చుకోవాలి. మానస్థితికి అనుగుణంగా మాటలు, చేతల ద్వారా గాడిలో పెట్టాలి. ముఖ్యంగా పిల్లలు స్నేహితులతో కలిసి చెట్లు, పుట్టలు, గట్లు, వ్యవసాయ బావులు, కాలువల వైపు వెళ్లడానికి ఇష్టపడుతారు. అలాగే సైకిల్ తొక్కడం, ద్విచక్ర వాహనాలు నడపడం నేర్చుకోవాలనే కోరిక పిల్లల్లో ఉండడం సహజమే. అంతే కాకుండా ఇతరులను చూసి తామూ నేర్చుకోవాలనే తాపత్రయంతో ఉంటారు. వేసవిలో ఒంటి పూట బడులు ఎంత సరదాను తెచ్చిపెడుతాయే...అజాగ్రత్తగా ఉంటే అంతకుమించి రెట్టింపు ప్రమాదాలు తెచ్చిపెడుతాయి.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

ఇప్పటికే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సూర్య కిరణాలు నిటారుగా భూమిపై పడతాయి. ఆ సమయంలో పిల్లలు బయట తిరిగితే అతినీలలోహిత కిరణాలు చర్మాన్ని దెబ్బతీస్తాయి. అందుకే వీలైనంత వరకు నీడలో ఉండడం మంచిది.

-ఎక్కువ సమయం విరామం దొరకడంతో సెల్‌ఫోన్లు ఎక్కువగా చూసే అవకాశం ఉంది. దీనిపై తల్లిదండ్రుల నియంత్రణ ఉండాలి. పుస్తక పఠనం అలవాటు చేయాలి.

-చిన్నారులు ఎక్కువ సమయం తల్లిదండ్రులకు అందుబాటులో ఉండే అవకాశమున్నందున వారికి నీతికథలు, పద్యాలు, నేర్పించాలి. స్ఫూర్తినిచ్చే వ్యక్తుల జీవిత చరిత్రలు చదివేలా చూడాలి.

–తేలికపాటి బట్టలు వేయాలి. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. నీరు, పండ్ల రసాలను ఎక్కువగా తాగించాలి. రెండు గంటల పాటు పడుకోనివ్వాలి. రాత్రి వేళ త్వరగా పడుకునే అలవాటు చేయాలి. నిద్రలేచాక కాసేపు చదువుకునేలా అలవాటు చేస్తే మేధోశక్తికి మేలు చేస్తుంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

ఉచిత శిక్షణ-ఉపాధి

jobs Apply Now!

★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహీంద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677